# వానలో దెయ్యాల కబుర్లు

వానలో దెయ్యాల కథలు భయంగా వుంటాయని కొందరు అనుకుంటారుట. కాని వానలో దెయ్యాలు తడుస్తాయా? ఝడుస్తాయా? అన్నది నాకు తెలియదు. దెయ్యాల మీదకి కబుర్లు వెళ్ళాయి. అందుకు వానదీ, మా శివుడిదీ, దెయ్యాలదీ కూడా బాధ్యత వుండి వుంటుంది.

సాయంకాలం ఆఫీసు వదిలే వేళ కసిగా వర్ష కురిసింది. చెప్పకుండా అత్యవసరంగా వేరే వేళ కుదరదన్నట్లు జలజలా మొదలై దడదడా మొత్తేసింది. వాహనయోగం ప్రతినిత్యం రెండు మార్లు పడితే తప్ప ఇల్లు చేరుకోలేని ఉద్యోగప్పక్షులంతా తలదాచుకోగల చోటున్న ప్రతిచోటుకి పారిపోతున్నారు. వాన కసిగా వెంటాడుతోంది!

ఆ వాన అందిరి మీద ఒకలాగే పడుతోంది. మద్రాసు నగరం పెద్ద లైట్ హౌవుస్ మీద, బస్సుస్టాపుల్లో నుంచున్న బస్సుల మీద అక్కడ ఇక్కడా అన్ని చోట్లా సూదుల్లా పడుతోంది వాన! వానొస్తుందని ఎవరికీ తెలియదు! ఎండలో గొడుగులు వేసుకోవడం అవసరమైన అరవయ్యో పడి మనుషుల మీద, ఎండలేకపోయినా చిన్న గొడుగులు నెత్తిన పెట్టుకోవడం ఫ్యాషన్ అనుకునే ఉద్యోగినుల ఒయ్యారపు గొడుగుల మీద కూడా నిర్దాక్షిణ్యంగా వాన మొత్తేస్తున్న వేళ, కాఫీ హోటల్లో దూరి, దొరికిన బల్ల వారకుర్చీలో రాజ్యం దొరికినంత ధీమాగా కూర్చున్న వేళ- కథ రాద్దామనిపించింది. కాఫీ వేడిగా హాయిగా వుంది. వానకి తడుస్తున్న వాళ్ళల్లో నేను లేను కనుక కిటికీల్లో నుంచి మనుషులకీ మనుషులకీ మధ్య ఏర్పడ్డ ఖాళీ భాగాలలో నుంచి అందంగా కనిపిస్తోంది వాన! వాన వేళకానివేళ వచ్చింది. ఇళ్ళకి చేరాకయినా వానవస్తే ఎంతో బాగున్ను. కానీ ఈ లోగానే పట్టుకుంది పాడువాన! అనుకుంటున్నారు ఇల్లు అనేవి గలవాళ్ళు. ఇళ్ళు అనేవి లేనివాళ్ళుహాయిగా ఏ సినిమాలోనో దూరింతర్వాత కురిపివా బాగున్ను అనుకుంటున్నారు. కొందరేమనుకుంటున్నారో చెప్పటం కష్టం. ఏమీ అనుకోలేదని అనుకోడమూ కష్టమే!

వానపడుతోంది. జోళ్ళు పాడైపోతాయి! వర్షం తగుల్కొంది. ప్యాంట్ పని సరి? రేపు ఆఫీసుకి గుడ్డల్లేవు. పాడు వాన! సినిమాకి వెళ్లాలంటే అడ్డంగా దొరికాసింది. టాక్సీ ఆగదు. ఆటో ఎక్కినా,

వానలోకి వెళ్లినా ఒక్కటే!' బస్సులో వాన పడుతున్నది కదాని అరసెకను తేడా రాకుండా టైమ్ టేబుల్ ప్రకారం బర్రు బర్రున పోతున్నాయి(?)... పాడు వాన జోరు పెంచింది.

కాఫీ సగం సిప్ చేసి మిగతా సగం వానంతా వెలిసిపోయే ఛాయలు కనిపించేదాకా అలా అలా త్రాగుతూండాటానికే నిర్ణయించుకున్న వాళ్లు వానను చూస్తున్నారు. ఏదో గొణుక్కుంటున్నారు. కొందరు వినిపించేలాగ, కొందరు వినిపించకుండా, కళ్లల్లో కనిపించేలాగ- ఈల వేస్తున్నారు. పాడు క్కుంటున్నారు కూడా. వాన చినుకులు టపటపా పడుతున్నాయి. కథ రాద్దామనిపించడానికి అదే సమయం ఎందుకు దొరకాలో నాకు తెలియదు. నాకే కాదు, ఆలా వాన అనుకోకుండా పడ్డప్పుడు ఎవరికైనా తెలియదు. కథ రాద్దామనుకోవడం వెచ్చని కోక్కో ఔనో కాదో చెప్పడం కష్టం. కథ రాయడం బొత్తిగా పని లేని వాళ్ల పని అని మా స్నేహితుడి లాంటి ఒకాయనకి అనుమానం! ఆయనకి కథలు రాయడం బాగా వచ్చునట. కాని తీరిక ఉండదుట! అంచేత యింకా రాయలేదు.

వాన యింకా కురుస్తోంది. సరదాగా, హాయిగా వాన చూస్తున్న వాళ్లకి ఆ హాయి తీరిపోయింది. లోపలికి దూరి కాఫీ తాగడం వాళ్లల్లో చాలా మందికి ఇష్టం లేదు. ఇష్టం లేదని నాకెలా తెలుసునంటారా? నా బల్ల ప్రక్కనే వున్న బల్లమీద కాఫీ కప్పులు కూడా తీసేసి క్లీనర్ తుడిచేశాడు. కాని గుమ్మంలో వాన చూస్తూ నించున్న వాళ్లెవరూ లోపలికి రాలేదు. బల్ల మీద రెండు ఈగలు వాలాయి! ఒకటి లేచి నా ముక్కుమీద వాలింది! తోలుకున్నాను. మళ్లీ వాలింది! ఒక్కటి వేశాను ముక్కు చుర్‌మంది. ఈగని కూడ చంపలేక పోయాను. దాని చావు నాచేతిలో లేదు. పుట్టించగలడేమో గాని మానవుడు గిట్టించలేడనేది చచ్చి స్వర్గాన ఉన్న మా మామ్మ (అంటే ఈగల సంగతి కాదు సుమా). ఆవిడ వాన పడుతూ వుంటే అసలు భయపడేది కాదు. చలి అనుకునేది కాదు. నూతి దగ్గరకు వెళ్లి వో రెండు డజన్ల బాల్చీల నీళ్లు నెత్తిన గుమ్మరించుకునేది. తన బోడి తల తడవదు అని ఆవిడకంత అపనమ్మకం? వాన పడుతూంటే నాకాదృశ్యం ఎప్పుడూ జ్ఞాపకం వస్తుంది!

వాన కురిసి తెరిపిగా ఆగిపోయింది కాబోలు, అందరూ బస్సుల కోసం వెళ్ళిపోతున్నారు. సైడ్ కాలవల్లో నీరు బొలబొలా పారుతోంది. మనుషులంతా రోడ్లమీదకి ఎగబడిపోతున్నారు. హోటలు గుమ్మం సిగరెట్ ధూమంతో నిండిపోయింది. ఆఖరి దమ్ములాగి పారేసి జనం బస్సుల వైపు పరిగెడుతున్నారన్నమాట!

కన్నీరొలికిన కలకంఠిలాంటి మేఘావృత ఆకాశభామ మొహాన సూర్యుడు పడమర దిక్కుకు జారిపోతూ బంగారు మలామా పూస్తున్నాడు. ఇక్కడ అస్తమిస్తున్న సూర్యుడు ఇంకో దగ్గిర ఉదయిస్తున్నాడు. కనుక ఏది ఉదయం? ఏది అస్తమయం? కథ రాయాలనుకున్నాను. అది సూర్యోదయం మీద రాసినా, సూర్యాస్తమయం మీద రాసినా ఒకటే అనిపించింది.

పొద్దున్న పదిగంటల వేళ బస్సులన్నీ కిటకిట లాడుతూ ఉంటాయి. సాయంకాలమూ అంతే. రావడం వెళ్లిపోవడం మధ్య ఆరున్నొక్క గంటల 'పని' చేయడంలో స్వార్థముంది, నాగరికత ఉంది. నగర జీవితముంది, ఎన్నికలున్నాయి. చాలీచాలని ఉపాధులూ ఉన్నాయి. మంత్రులున్నారు,

రాజ్యాంగముంది, అధిక ధరలున్నాయి. సమ్మెలున్నాయి. అవి చెయ్యలేనప్పుడు గొంతుకలున్నాయి. అరుద్దామంటే శక్తి కావాలి. ఆ శక్తి కూడా వుంది. కాని వాన వీటన్నింటికీ ముందు నుంచీ వుంది. అది ఇంకా పాతది! దారికాసి పట్టుకుంది. అంచేతనే బ్యాంక్‌లో పనిచేసేవాళ్ల వూరేగింపు ముక్కలు ముక్కలుగా విడిపోయి, ఆ వారా, ఈ వారా తలదాచుకొన్నది. ఈ గ్రూపులో ఆరుగురమ్మాయిలున్నారు. వాళ్లు నినాదాలు అరవరు, గుంపులు ముందు అలంకారప్రాయంగా నడుస్తారు. వాళ్లూ తడిసి పోయారు. తడిసి యింకా భేషుగ్గా వున్నారు!

ఒక్క ఇద్దరు అలాగే వానలో సినిమాల్లోలాగ, కథల్లో లాగ తడుసుకుంటూ వెళ్లిపోయారు. ఒకమ్మాయి చేతిలో గొడుగు వుంది. వేసుకోకుండా వెళ్లిపోతోంది. వాన అంటే ఇష్టమో, అదేదో ఫ్యాషనో లేదా ఆ గొడుగు యిప్పాల్సింది కాదో..

అంతలో ఉరుములు! నేను ఇక లాభం లేదు అనుకున్నాను. ఈ వాన రాత్రి కూడ కురుస్తూంది. ఇళ్ళల్లో వెచ్చగా వున్న వాళ్ళ మీద తప్ప అందరి మీదా కురుస్తుంది. ప్రొద్దున్నే కలకత్తా మెయిల్ లేట్ అవుతుంది! కాని నేను లేటవుతే హోటల్లో కూడుండదు!

అంతలో వచ్చాడు మా రామం-గాలివానలాగా వున్నాడు. తడిసిన పాములాగా బుసకొడుతున్నాడు. ఫ్యాంట్ గుండీ ఒకటి తీసుకోమన్నాను (అయిమీన్ బొడ్డు దగ్గరిది) ప్యాంట్ సాధారణంగా కుట్టించి నప్పుడు వాడి నడుం మీద నుంచి జారిపోతూంటుంది గాని రెండు వారాల్లో ఇరుకైపోతుంది! అంటే అది అలానే వున్నా, మా రామం దానికి లావైపోతాడు. వాడు ఒక పూట చెపాతీలు తింటాడు. అయినా వాడికి ప్యాంట్ సమస్య తీరడం లేదు. డయిటింగ్ చేస్తున్నాడు పాపం. అందుకనే రెండు బాసుందీలు, ఒక టమోటా పళ్ళరసం కూడతాగుతున్నాట్ట రోజూ. మా రామం నా ఎదుట కూచున్నాడు, తడిసి మరింత లావెక్కాడు వాడు!

"ఏం జరిగిందో తెలుసా?" వాడు ఆ ప్రశ్న వేయడం, కూచోడం అనే రెండు పనులకు ఒకటిన్నర నిమిషం పట్టింది. ఈ లోగా నేను రెండు వేళ్లు చూపించి రెండు కాఫీలను సంకేతించి "వేడిగా ఉండాలి' ' అన్నాను.

ఏం జరిగిందోనని మావాడి ప్రశ్నకు తెలియని వాళ్లు కుతూహలం చూపవచ్చుగాని నేను ఆ పని చేయలేను. అవతల వాన మళ్లీ జోరుపెంచింది. మా వాడు గట్టిగా మాట్లాడాలి. అది సంఘ శ్రేయస్కరమైన కార్యంకాదు. హోటేలు వాడు కోప్పడవచ్చును. వాడి గంభీర కంఠం కారణంగా ఒక సారి ఏం జరిగిందో నేను చెప్పితీరాలి.

వాళ్ల వూరు కాలేజీలో ఒక హాస్టలుంది. అందులోనాలుగేళ్ల క్రితం ఓ సంవత్సరం పాటు మా రామం నివసించేడు. ఒసారి ప్రతీసారి లాగే పాటల పోటీ జరిగింది. ఆ హాస్టలులో ... "లలిత" గానకచేరి పోటీ అంటారు వాళ్లు. కాని రామ రామ గానకచేరి చేశాడు మావాడు దాన్ని ఎలా అంటే

కార్యదర్శి మైక్‌లో "పాడే వారింకా ఎవరేనా ఉంటే పేరు ఇవ్వండహో" మన్నాడు. రామం ప్రక్కనే వున్న సూర్యం, రామం మీద వున్న ప్రిజుడిస్‌ని తీర్చుకుందామని గట్టిగా 'రామం' పేరు

ఇచ్చేశాడు. "వీడు రఫీగారు రామం కాదు" అన్నాడు.

పాడితీరాలని అంతా గోలచేసి రామం రామం అని పదే పేరుపిలిచారు, దొరికిపోయాడు! స్టేజి మీద మొదటి కీర్తనగా ఆరున్నొక్క రాగమంటారే అదే అందుకున్నాడుట. తర్వాత కోపంగా కసిగా "వెధవల్లారా నాకు పాటల్రావు. సినిమా పుస్తకాలు తెచ్చి తగలెట్టండ"న్నాడు. ఒక్కో పుస్తకం తీశాడు "నీవే నేనుగా - నేనే నీవుగా" అని "లైలా మజ్నూ' పాట మొదలు - అప్పటికి తెగ పాపులర్ అయిన 'నిలువవే వయారీ భామ" పాట దాకామైక్ తీసి ప్రక్కన పారేసి మరీ మంద్ర స్థాయిలోనే వొంద్ర పెట్టేశాడు. ఆఖరి వరస వాళ్ళు కూడా నిలవలేక పారిపోయారు!

కార్యదర్శి తెలివైన వాడు, రామాన్ని నోరు మూయించగల సమర్థుడు. వెంటనే మొదటి బహుమానం అనుకున్న వెండి కప్పును రామం చేతుల్లో పెట్టి నోరు మూయించాడు. ఆ 'కప్పు' ఇంకా వుంది మా రామం డ్రస్సింగ్ టేబుల్ మీద! అదీ వాడి కంఠశోభ!

రామం కొంచెం కాఫీ చప్పరించి "అది కాదురా! ఏం జరిగిందో విన్నావుకాదు" అన్నాడు.

విసుగ్గా వుంది నాకు. కథ రాయాలనిపించడం లేదు. ఇందాక మావాడు రాకపూర్వం శ్యామలమీద కథ రాద్దామనుకున్నాను. - శ్యామల వానలో వెళ్లిపోతోంది. సన్నంగా... సరళంగా, కలువ కాడ కాంతులీనుతున్నట్లు. ముక్కు మీద కోపమున్నా- జడ ముందుకు వేసుకున్నప్పుడు ఆ పడుచుపిల్ల మహా సొగసుకత్తే, కాని ఇక నా కథకి కథానాయిక లేదు. రామంగాడొచ్చేశాడు అడ్డంగా. శ్యామల వెళ్ళిపోయింది. వాళ్ళ ఇంటికి వెళ్లి తడి చీర ఇప్పేసి, జుట్టారబోసుకుంటూ వుంటుందిప్పుడు! ప్చ్!ప్చ్!..

-నాన్‌సెన్స్? నీ బోడి కాఫీ నాకక్కర్లేదు! అసలేం జరిగిందో వినవేమ్?" అంటూ నన్ను వాడు కోప్పడ్డాడు.

"చెప్పు" తాపీగా అన్నాను-మెత్తగా

"నాయుడుగారు చచ్చిపోయార్రా?" వాడి కోపం ముక్కు పుటాల్లో కనిపించింది! దు:ఖం మాత్రం లేదు.

కాని యీమరణవార్త విన్న నాకు వొళ్లు బరువెక్కి పోయింది. అప్రయత్నంగా లేచాను. రామం కూడా లేచాడు. వాన రెండు క్షణాలాగింది. బయట పడ్డాం. నాయుడు నాకు తెల్సిన వాడు. రామానికి దూరంగా బంధువు. కాని ఎవరి ప్రాణాలైనా అంతే కదా వాన ఆగినట్లుగా ఆగిపోతాయి. టాక్సీలో కూచున్నాం.

"నాయుడుగారెలా పోయాట్ట?"- అడిగాను. వాన నెత్తి మీద మొత్తుతున్నది టాక్సీకి హారన్ అక్కరలేదు! అమ్మాయిలు పరికిణీలు, అబ్బాయిలు ప్యాంటులు, స్త్రీలు చీరలు పురుషులు పంచెలు ఎత్తిపట్టుకుని బుద్ధిగా ఫుట్‌పాత్‌మీదనే గెంతుతున్నారు! భలే దృశ్యాలు!

"చేతబడి చేశార్ట! ఘోరం కదూ" అన్నాడు రామం.

"నోర్ముయ్! అన్నానేను.

"లేదు లేదు- నిజమేనట" అన్నాడు వాడు.

అసలు ప్రాణాలు పోలేదనే అనుకున్నారట? 48 గంటలు నాయుణ్ణి అలానే ఉంచేశార్ట మళ్ళీ ప్రాణం వస్తుందని ఆశతో

"ఎందుకు చేశారుట?సోకాల్డ్ చేతబడి?" అడిగాను నేను.

మన శివుడు షెల్ ఇంటర్వ్యూకి వస్తూ ఈ వార్త మోసుకొచ్చాడు. వాడే చెప్తాడు పద... రూమ్‌లో వున్నాడు- "నాయుడుగారంటే ఆ వీధిలో కుర్రాళ్లందరికీ ఇష్టం- ఎందుకంటే అతని విధవప్ప చెల్లెలికి ముగ్గురో నలుగురో వయసులో వున్న కూతుళ్లున్నారు! పెద్దమ్మాయి సోఫియా లారెన్స్ లాంటి అవయవ సౌష్టవం ఉంటే మూడో అమ్మాయికి పందొమ్మిదో ఏడు మొన్ననే ప్రవేశించింది! పైగా అమ్మాయి రెండు జడలు వేసుకుంటుంది! లిప్‌స్టిక్ రాసుకుంటుంది! ఆ అమ్మాయిలు ఆ వీధికే ఒక 'కళ కళ' అనుకుంటాం మేము. నాయుడుగారికి చాదస్తం లేదు. వాళ్లు సీతాకోక చిలుకలు! వాళ్ల కోకల్లో ఎక్కువ భాగం నైలాన్‌లే? అదీ ఆయనకు చాదస్తం లేదంటే అర్థం.

నాయుడు పోలీసు నౌకరీ అంటే మూడు వందల ముప్ఫైఆరు, నాలుగువందల నలభై ఒకటీ కాదు- సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌రీ చేసి రిటైర్ అయినాడు! అతనికి కొడుకుల్లేరు. ఉన్న ఒక్క కూతురు సినిమాల్లో ఎక్స్‌ట్రాగా చేరిపోయిందట. ఈ మధ్య ఎక్కడా తెరమీద కనిపించడం లేదనుకోండి.

నాయుడికి మేనకోడళ్ళే అంతా? కాని పెద్దది కాలేజీలో సినిమా స్టార్ కన్నా పెద్ద పేరు తెచ్చుకోవడంతో, రెండోదాన్ని టైప్, షార్ట్‌హాండ్ కొట్టుకి తప్ప కాలేజీ చదువులకు వెళ్లనివ్వనన్నాడు. చిన్నది మొదట్లో కాస్త మంకుతనం పోయి నేను కూడా కాలేజీకి వెళ్తాను అంటే ఖద్దరు చీర, సైను జాకెట్‌లు వేసుకుంటానని ఒట్టుపెట్టమన్నాడుట నాయుడు. అంతే ఆ పిల్ల టైపు ఇన్‌స్టిట్యూట్‌కే వెళ్లింది. అలా రోజూ వెళ్తూండేది. ఆ ఒకనాడూ వెళ్ళింది. మరి రాలేదు (ఆర్నెల్ల క్రితం వచ్చింది లేండి అది మళ్లీ కత)

ఆ నాయుడు గారు ఇప్పుడు పోయాడు, కాని ఆయన జీవిత 'అగాధంలో' చాలా లోతు సత్యాలున్నాయి.

రూమ్‌లో శివుడు, భీముడు వున్నారు. శివుడు మీసాలు పెంచాడు. దెయ్యాలు జ్ఞాపకం వచ్చాయి నాకు- ఎందుకో తెలీదు.

"నీకోసం వాణ్ని పంపించి ఇక్కడ విరహంతో చస్తున్నాంరా బాబూ" అన్నాడు వాడు నన్ను చూస్తూనే.

భీముడు కాల్చి పోసిన సిగరెట్ పీకలు కాళ్ళ క్రింద చితచితా వానలో చీకట్లో నడిచేవాళ్ల కాళ్ల క్రింద "చిరు కప్పలు" పడ్డట్టు పితా పితా పడుతున్నాయి!

భీముడు అసలు పేరు కుమార్. విగ్రహం మాత్రం మారు పేరుకు తగ్గట్లుంటుంది! వాణ్ని తిడదామనుకున్నప్పుడు నేను రామాన్ని తిడతాను! రామం కోపం వచ్చి వెంటబడితే, పారిపోవచ్చును.

వాడు పరుగెత్తలేడు. మన్ను తిన్న పాము! భీముడు వెంటబడితే నా కథ కంచికే.

"ఏం చేస్తున్నార్రా వీళ్లు? రామం? దీపావళి మర్నాడు లాగ వుంది రూము. బాణ సంచా తగలెడుతున్నారా?" అడిగాను. శివుణ్ని మోతాదుగా కౌగిలించుకుని వదిలేస్తూ.

"అసలేం జరిగిందో తెలుసా?" అని మళ్లీ రామం మొదలెట్టకముందే భీముడన్నాడు- "తెలుసు, తెలుసు- నాయుడుగారు చచ్చాడన్న వార్త శివుడు తెచ్చాడని నన్ను లాక్కొచ్చాడు వానలో వీడు" అన్నాడు కసిగా!

నేను కూడ చేరి రూములో 'చతుష్టయం' అయ్యాం.

"కూచోండిరా!' అంటూ కూచున్నాం అందరం.

"నాయుడుగారు పోయిన నెల పోయాడు! ఇపుడు మనం ఏడ్వనక్కర లేదుగాని- ఆ అమ్మాయిలు అందరూ ఎక్కడున్నారూ? అన్నదే భేతాళ ప్రశ్న" అన్నాడు భీముడు. భీముడికి 'మధ్య అమ్మాయి రమ్యలత అంటే ఇష్టం. అందుక్కారణం లేకపోలేదు. కుమార్ ఇంకా భీముడు కాకమునుపు- ఒకసారి ఆ వీధిలో సందు మొగను స్థాపించిన కళామందిర్ వాళ్లు ఓ నాటకం వేశారు. అది "ద్రౌపదీ వస్త్రాపహరణమో", "సీతమ్మ అరణ్యవాసమో" అంతగా జ్ఞాపకం లేదు గాని- మొత్తానికి భీముడి వేషం లాంటిది కుమార్‌చేత బలవంతంగా వేయించారు! కుమార్ మామూలుగానే భీముడి లాంటివాడు- భుజకీర్తులూ కిరీటం గట్రా పెడితే 'ఒహోమని వున్నాడు. కాని తీరా మంచి రసపట్టులో డైలాగు మరిచిపోయాడు! వాడు విగ్రహ పుష్టికి పెట్టింది పేరేగాని... వెనక నించి శివుడు ఆ డైలాగు గట్టిగా అరిచి వాడి 'మానం కాపాడాడు! ఆ రోజు ఆ రెండో అమ్మాయి కుమార్‌ని "భీముడుగారూ" అని పిలిచి మరీ అభినందించింది. మీరు సరిగ్గా అచ్చు భీముడిలాగే వున్నారండి"అంది- 'భీమ' కుమార్‌కి శివాజిగణేశన్‌లా నాటి నుంచి నేటి దాకా ఆ పేరు నప్పింది! అంచేత నాయుడు మరణం భీముడికి శివుడికి, రామానికి ముగ్గురికీ బాదరాయణమే!

నలుగురం పాత సంగతులు - అమ్మాయిలూ అన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాం. శివుడు మళ్లీ కథంతా చెప్పలేనన్నాడు. ఒప్పుకోలేదు మేం.

అవతల వాన ఏనుగు తొండాల్లా పడుతోంది. "నువ్వింత కన్నాచేసి చచ్చేది ఏమిటి? నువ్వు పూర్ణించి తెచ్చిన అరిసెలు యిలా పారేయ్! తింటూ వింటాం చెప్పు... అసలు 'చేతబడి'అంటే. నాకునమ్మకం లేదు. అసలూ, ఓ మారేంజరిగిందో తెలుసా?... అంటూ నేను వాణ్ణి యిమిటేట్ చేశాను.

"ఉండవోయ్! అసలూ! ... నాయుడికి దెయ్యాలంటే నమ్మకం లేదు- అంటే" నేను 'అబ్జెక్ట్ చేస్తాను" అన్నాడు భీముడు.

"అబ్జెక్షన్ ఓవర్ రూల్డ్" అన్నాడు రామం.

"పెర్రీమేసన్ పుస్తకాలు విపరీతంగా చదివిన పాతకాలంనుంచే వాడి కామాట అలవాటయింది.

"ఏం? ఎందుకనీ?" నిలదీశాడు శివుడు.

భీమకుమార్ చెప్పింది అతని మాటల్లోనే చెప్పాలి అంటే కష్టం. వేరే టీకా తాత్పర్యాలు గట్రా రాసి పురాణమంత చేయాలి. గ్రంథ విస్తరణ భీతిచేత నాయుడుగారనే భీకర సర్కిల్ ఇన్స్పెక్టరులో దెయ్యాలంటే నమ్మకం ఎందుకు ఎలా కుదిరిందో "భీము"డి కథను సారాంశంగా చెప్పేస్తాను.

భీముడు కథ చెప్తున్నపుడే లైట్లార్పిపోయాయి. రామం నాకు దగ్గరిగా జరిగాడు. పాత మాంబళంలో ఒకానొక వీధిలో వాడున్నప్పుడు పక్కింటి సూరమ్మకి దెయ్యం పట్టుకుంది ఓసారి. ఆ ఓసారి కూడ ఇలాగే వాన పడుతోంది. అమావాశ్య ఆ ముందునాడో మర్నాడో కాబోలు, చీకట్లో వాన మెత్తగా కురుస్తోంది. ఎలక్ట్రిక్ లైట్లు ఆప్రాంతాల చాలా తక్కువగా ఉన్నా, వానలో వెలిగే కరెంటు దీపాలు యిండియాలో వుండవుకదా?

రామం రూమ్‌కి వెళ్తున్నాడు. తడిసి ముద్దయి పోయాడు! వెంటనే ఆ గుడ్డలు ఇప్పిపారేస్తేనే గాని మర్నాడు నిమోనియా వచేస్తుందనే భయంతో తడుముకుంటూ రూమ్‌కు వెళ్తున్నాడు. రామం భయస్తుడు కాడుట!- కాని సూరమ్మకి లేదా సూరమ్మకి పట్టిన దయ్యానికి భయస్తులెవరో, కాని వాళ్ళెవరో తెలియదల్లే వుంది! వెనకనించి వచ్చి మెడ పట్టుకుని, "ఎవడ్రా నువ్వు?" అంది!

రామం తన పేరే మరిచిపోయాడు "అమ్మా" అందామనుకున్నాట్ట- వణికిపోతున్నాడు.... చలి... భయం- వాన-పెదాలు అతుక్కుపోయాయి.

"ఎవడ్రా నువ్వు?" మళ్లీ సూరమ్మ దెయ్యం గద్దించింది. మెడ నరాలు పిండేస్తోంది నోరు విప్పి చెప్పలేక పోయాడు.

"నా మొగుడువేనా నువ్వు ?" అంది దెయ్యం.

సూరమ్మ మొగడు కమ్మరి, కమ్మొచ్చులు తీసేవాడు.

రామం ఈసారి నోరు పెగిల్చాడు. కాని అనుమానం వచ్చింది.

'ఔను' అనాలా 'కాదు' అనాలా? చివరికి... "కాదు" అన్నాడు. అవును అంటే మర్నాడు రాగల ప్రమాదం కన్నా దెయ్యం చేత దెబ్బలు తినడం మేలనుకున్నాడట.

ఒకటి 'ఛెళ్లున' ఆ మాట పూర్తిగా కుండానే వీపుమీద చరిచింది. సూరమ్మదెయ్యం.

'అమ్మా!' అన్నాడు రామం! ఒక్కసారి విద్యుత్ నరనరాల్లో ప్రసరించి అదే నగరానికి సప్లయి అయిందా అన్నట్లు ఒళ్లు ఝుల్లుమంది. కళ్లు జిగేల్ మన్నాయి!

దూరంగా లైట్‌లు వెలిగాయి!

రామం మా రూమ్‌కి వచ్చి వారం రోజులు జ్వరం పెట్టుకున్నాడు. దెయ్యాలంటే నమ్మకం లేదంటాడు. కాని వాడికి సూరమ్మ దెబ్బతో దెయ్యాల భయం మాత్రం బాగా పట్టుకుంది! ఆ దెబ్బ సూరమ్మ కొట్టిందో, దెయ్యం కొట్టిందో నాకూ తెలీదు. కాని ప్రతీసారి వాన పడుతూన్న రాత్రి లైట్లారిపోతే చాలు, వాడు నాదగ్గరిగా జరుగుతాడు!

భీముడు కథ చెపుతున్న వేళ మా గది కప్పుమీద 'రాళ్ళు' పడపడా వానతోపాటు పడ్డట్లు

చప్పుడైంది.! శివుడు కూడా కాస్త దగ్గిరగా జరిగాడు.. భీముడు కీ.శే. సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారి కథ కొనసాగించాడు - నాయుడుగారు విశాఖపట్నంలో ఉన్నాట్ట అప్పుడు.

ఛస్తే! దెయ్యాల్ని నమ్మను అనేవాట్ట పాపం!

ఒకసారి ఒక ఆడకూతుర్ని పోలీసులు దొంగతనం చేసిందని పట్టుకున్నారు. ఆవిడ మర్నాడు స్టేషన్‌లో నాకు ఏమీ తెలియదని ఏడ్చింది. కాని నాయుడుగారు ఒప్పుకోలేదు. పాపం! ఆవిడ భర్త వచ్చి "బాబూ! పిల్లలవాణ్ణి. కలో గంజో పెళ్లాం పిల్లలకు పోసి పోషించుకోగలవాణ్ణి. అది మా ఆవిడ తీసింది అన్నమాట నిజమే కాని... కాని మా ఆవిడకా సంగతి తెలియదు. ఈ మధ్య ఒక దెయ్యం నా ఇల్లాల్ని పట్టి పీడిస్తున్నది... ఆ దెయ్యమే యిలా నగల్ని దొంగలిస్తుంది. ఆ దెయ్యం చేసిన పనే ఇది తప్ప మేం కాదు" అని మొరపెట్టుకున్నాడట.

ఆ 'యిల్లాలు' ఒకసారి పక్కింటి డాబామీద వొడియాలు అప్పడాలు- వేసిన తలుపులు వేసిఉండగానే తెచ్చేసిందిట!- యిలా ఎన్నో కథలు చెప్పాడా యిల్లాలి మొగుడు.

కాని నాయుడు 'దెయ్యాలు గియ్యాలు లేవు. దొంగవేషాలు, దెయ్యంగియ్యం వుంటే పోలీసులెందుకు ఇంక?" అన్నాడు- గట్టి జుల్మానా వేయించాడు.

నాయుడు కూతురికి- ఇపుడు సినిమాల్లో తన వయసు 'ఇరవై ఆరు' అని బుకాయిస్తున్న ఎక్స్ట్రా స్టార్‌కి అప్పుడు ఇరవై ఏళ్లుంటాయి. అంటే పదిహేనేళ్ల క్రితం మాట!

నాయుడు దెయ్యాల గురించి ఎంత ఈసడింపుగా మాట్లాడతాడో తెలిసిన పోలీసులకి కూడ ఒక్కోసారి నాయుడిమీద ఓ దెయ్యాన్ని మహంతి మరిడయ్యకు చెప్పి వదిలిపెడ్తామా? అని ఉండేదిట!

నాయుడు ఆ వూరినించి ఇక బదిలీ అవుతాడనగా ఒక విచిత్రమయిన సంఘటన జరిగింది. గొప్ప వెండి బంగారు నగల వర్తకుడు సుబ్రహ్మణ్య శ్రేష్టిగారింట వజ్రాల ఉంగరం పోయింది!

అదే రిపోర్టు చేశారు... ఆనక నాయుడు ఇంటికి వచ్చాడు. పెళ్లాం స్వర్గస్తురాలైంది. మొదటి కూతురే తనకి సర్వస్వమూ - 'కుమారీ' అని కేక వేశాడు.

కాఫీ పకప్పుతో వచ్చింది కుమారి. నల్లని చీరకట్టుకుంది. జుట్టు విరబోసుకుని వుంది!

కప్పు అందుకుంటూనే 'తలంటుపోసుకున్నావే తల్లీ?" అందామనుకున్నాడు నాయుడు కాని అంతలో గతుక్కుమన్నాడు. కుమారి చేతి చూపుడు వ్రేలికి 'దుక్కం'త వజ్రపుటుంగరం వుంది. నాయుడు గుండెలు జారిపోయాయి!

"అదేంటమ్మాయ్?" అన్నాడు గద్దించి

"మందేలే నాయనా! కొట్టుకొచ్చాం..." అంది కుమారి.... నవ్వుతోంది కుమారి. ఆ నవ్వుల్లో వికటముంది. విస్ఫోటముంది. వికారముంది! నాయుణ్ణి భయపెట్టాలనే ప్రయత్నం వుంది.

నాయుడు కప్పు నక్కడ పారేసి కూతురితోపాటు మేడమీదికి పరుగెత్తాడు.

గదిలోకి వెళ్లిపోయింది కుమారి.

"తల్లీ! కుమారీ! తలుపుతియ్యే" నాయుడు చెమట లొత్తుకున్నాడు. మీసాలు నలుపుకుంటున్నాడు. తులుపు తియ్యలేదు కుమారి.

పైగా మేడ క్రిందనించి కేకేసింది. "నాయనా! నీకోసం శెట్టిగారొచ్చారు రా?" అని

అది కుమారి గొంతే. కంచుగంటలా ఖంగుమంది. నాయుడు గుండెలు ప్రేలిపోతున్నాయి. ఇదెలా సాధ్యం? అనుకుంటూ క్రిందికి వచ్చాడు. ఉంగరంవేలు వయ్యారంగా ముక్కున వేసుకుని కుమారి- ఎదురుగా నిప్పులు గ్రక్కుతూ - బుసలు కొడుతున్న పాములా, శెట్టిగారు.

నాయుడు పెదాలు తడి చేసుకుని కుమారికి దగ్గరగా వెళ్ళి 'తేమ్మా' అని సౌమ్యంగా అంటూ బలంపూనా ఆ చెయ్యి పట్టుకుని ఉంగరం లాక్కుని శెట్టిగారివైపు తిరిగి "నమస్కారం సార్! మీ ఉంగరం దొరికింది! ఇదేనా?" అంటూ అందించి- కుమారికేసి తిరిగి 'కాఫీ తేమ్మా' అని కేకేసి ఉస్సురన్నాడు. కుమారి వయ్యారంగా వెళ్తోంది.

"అమ్మాయి సరదాపడి వోసారెట్టుకుంది" అన్నాడు. లక్షరూపాయలిచ్చినా నాయుడు అంతకంటే బాగా నటించలేడు. ఆ మాట నాయుడే అన్నాట్ట! శెట్టి తప్పనిసరిగా ఆ మాటలు నమ్మాడు.

కుమారి

నవ్వు గలగలా ఇల్లు మారుమ్రోగింది. నాయుడికి ఆ ఒక్క గండం ఎలాగో గడిచింది- కానీ అటు తర్వాత ఆర్నెల్లు కుమారి-నాయుడి చేత మూడు చెఱువుల నీళ్లు త్రాగించిందట.

కుమారి వీధిలోకి వెళ్లి వస్తున్నప్పుడు సాధారణంగా నల్లని సిల్కు చీర కట్టుకుని వచ్చేది. హేండ్‌బాగ్‌లో రోజుకో నగో, వంద రూపాయల నోటో వేసుకుని మరీ వచ్చేది! నాయుడు ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. కూతురుకి మతి భ్రమించిందనుకున్నాడు. పెళ్లి కావాల్సిన పిల్ల. కడుపు చించుకుంటే కాళ్లమీదే పడుతుంది! కుమారిని చాలా మంది మామూలు మనిషే అనుకునేవాళ్లు. పైగా మరీ వయ్యారాలు చిలుకుతూ వుండేదట.

రహస్యంగా డాక్టర్‌లకి చూపించాడు. వాళ్లు మంత్రాలు వేయించమన్నారు. నాయుడు మండిపడ్డాడు- సైన్సు మంటగలిసిందన్నాడు.

కూతుర్ని గదిలోపెట్టి, దానికి జైలు ద్వారాలకి వేసినంత తాళం కప్ప వేసి ఇద్దరు పోలీసులను మంచి బలమైన వాళ్లని కాపలా పెట్టేశాడు.

ఒకనాడు కుమారి లోపల శ్రావ్యంగా పాడుతోంది. బయట వానపడుతోంది! కుండపోతగా కురుస్తోంది. పాట, వాన చప్పుణ్ని చీల్చుకుని నాయుడి చెవుల్లో గింగురుమంటున్నది.

"ఉసిరికాయలు దొంతులుగ పెట్టగనేర్తూ...

బోడితల నంటగనేర్తూ...

మొగలాయీ దర్బార్ నేలగన్నేర్తూ...

సీతారాముల నెడబాయగనేర్తూ...

నాయుడు తల సున్నగ చేయగనేర్తూ...

అని పాడుతూనే ఉంది కుమారి. నాయుడికి పీడకలలాగా గడిచింది ఆ రాత్రి.

మర్నాడు తెల్లవారక మునుపే పోలీసుల్లో ఒకడు పరారీ అయ్యాడు. రెండోవాడు నాయుడి దగ్గరకు వచ్చి ఏడుస్తూ గోలపెట్టేశాడు.

రాత్రి తను గది గుమ్మంలోనే పడుకున్నాట్ట- బాగా జ్ఞాపకం. రెండోవాడితో కబుర్లు చెబుతూ నిద్రపోయాడట- కాని అపుడు తెలివివచ్చి చూసుకుంటే, వానలో తడుస్తూ ఇంటి ప్రహరీ పిట్టగోడ మీద పడున్నాడట!

"సార్! పిల్లలవాణ్ణి! దెయ్యాలతో పేచీ వద్దుసార్! మీకాళ్ళు పట్టుకుంటా" నన్నాడువాడు. భోరున ఏడిచాడు.

నాయుడికి కోపం, దు:ఖం ముంచుకు వచ్చాయి. హంటర్ తీసుకుని కూతురి దగ్గరకు వెళ్లాడు. కుమారి ముందు రాత్రి తెల్లని సిల్కు చీరకట్టుకునుంది. కాని నాయుడు తలుపు తెరిచే సరికి నల్లని సిల్కుచీరతో వికటంగా నవ్వుతూ "నాయుడోరి ఇంటికాడ... నల్లతుమ్మ చెట్టునీడ... ఎర్ర ఎర్రని పూలవోడ... హెయ్!" అంటూ పాడుతోంది.

హంటర్‌తో చితకబాదేసి, మొర్రోమని ఏడ్చాడు నాయుడు. కుమారి ఒళ్లు నెత్తురు చిమ్మి, సొమ్మసిల్లిపోయింది. నాయుడు దెయ్యాలున్నాయని లెంపలు వేసుకుని మరీ ఒప్పుకున్నాడు. మంత్రాల 'మహంతిని' పిలిపించి మూడు వేల నిమ్మకాలు ఆరు వందల కొబ్బరికాయలూ, మూడు అమావాశ్యలూ జపాలు చేయించి వెయ్యిరూపాయలూ వదిలించుకున్నాడు.

అంచాత నాయుడికి దెయ్యాల నమ్మకం లేదూ అనడానికి వీలు లేదు అన్నది ఋజువైంది.

శివుడు , భీముడు చెప్పిన ఈ కథను కాదనలేం. నాయుడు మరణం ఆ కథ జరిగన పదిహేను సంవత్సరాలకి జరిగింది. దెయ్యాలున్నాయి అని ఒప్పుకున్న అతనిమీద అంత ఆలశ్యంగా 'చేతబడి' ఎందుకు జరిగిందో శివుడు చెప్పాల్సి వుంది! నాయుడు కూతురు సినిమాల్లో ఉందిట. బహుశా ఇప్పుడా అమ్మాయిని దయ్యాలు పడుతున్నాయో లేదో? తెలియదు. రామం మాంబళంకేసి వెళ్లడం మానేశాడు. సూరమ్మ దెయ్యం కూడా పోయిందిట? అయినా వాడికి నమ్మకం రాలేదంటాడు.

చీకటిగా వుంది. ఫ్యూజు కాలిపోయింది కాబోలు- మరిలైట్లు రాలేదు. బీముడి సిగరెట్లే ఎర్రగా వెలుగుతున్నాయి!

ఒక బొద్దింక కాబోలు శివుడి వీపుమీది ప్రాకింది. వాడింక కథ చెప్పనన్నాడు. కాని భీముడు వదల్లేదు.

'రమ్యలత' మేనమామ అయిన నాయుడుగారి చావు తనకి అత్యంత అవసరమైందన్నాడు. శివుడు బలవంతంగా చెప్పాడు.

నాయుడుగారు మేనకోడళ్లకు పెళ్లిళ్లు చేద్దామనుకుంటూ కర్నూలు వెళ్లి కాపురం పెట్టాడు. అక్కడ ఒకనాడు పెద్దది 'సుమిత్ర' ఒక కారుడ్రైవరుతో మాట్లాడుతూ కనిపించిందట. నాయుడు బలిష్టుడు. కోపిష్టి. సుమిత్రని ఏమి అనలేదు. ఆ డ్రైవర్ని పట్టుకుని చావచితక్కొట్టాడుట!

డ్రైవర్ సుమిత్ర తనను ప్రేమిస్తోందనీ-ఇద్దరూ మద్రాస్ పోయి టాక్సీ కొనుక్కుని కాలక్షేపం చేస్తామనీ మరీ మరీ చెప్పాడు. నాయుడు ఆ కుర్రాణ్ణి మళ్ళీ చితక్కొట్టి జాగ్రత్త అని సుమిత్రను గదిలో పెట్టి తాళం వేశాడట!

అటు తర్వాత ఆరు నెలల్లో ఒకరోజు ఉదయం తొమ్మిది గంటల వేళ నాయుడుగారు మెట్లమీద నించి జారి పడ్డాడు. అంతే మంచం పట్టాడు. నాయుడిగారి విధవ చెల్లెలు మూడు నెలలు తిరక్కుండానే డాక్టర్లను మానిపించేసింది. మంత్రగాళ్ళను పెట్టింది. వాళ్ళల్లో ఒకడు నెల్లిమర్ల నుంచి, ఇంకొకడు ఆదిలాబాద్ నుంచీ వచ్చారు. హోమం చేశారు. 'బ్రహ్మ రాక్షసన్నారు'. ముగ్గులు వేశారు. ఇంట్లో దోమలు మూడు తరాలదాకా చచ్చేలా సున్నాలు, బూడిదా చల్లేరు. గుమ్మాలకి మేకులు గొట్టారు. అమ్మాయిలు ముగ్గురికీ రక్షరేకులు కట్టారు. నాయుడుగారి మంచం చుట్టూ మేకులు గొట్టారు. ఇనపెట్టెకు తాళాలు వేయకుండా వదిలేసే మేరకు- ఇక దాని అవసరం లేదనుకునేటంతవరకు ఖాళీ చేయించేశారు.

నాయుడుగారు మరి మూణ్నెళ్లకి మామూలుగా తిరుగుతాడని, ఇదెవరో కిట్టని వాళ్ళు వూరికి పడమరగా వెళ్లి చేసిన ప్రయోగమని చెప్పారు మంత్రగాళ్లు.

కిట్టనివాళ్లు అంటే సబ్ యిన్‌స్పెకర్, సర్కిల్ యిన్‌స్పెక్టర్ లాంటి పోలీసు నౌకరీలు చేశాడు కదా. చాలమంది ఉంటారన్నారు అందరూ.

సుమిత్ర మంత్రగాళ్లని కలుసుకుందట. బహుశ తనవల్లనే మామయ్యకి ఈ అనుకోని ప్రయోగం జరిగిందేమోనన్న అనుమానం ఆ పిల్లది. మామయ్యకి నయమైతే తన చంద్రహారం రెండు పేటలది ఇచ్చేస్తానని చెప్పిందట కూడా.

అందులో ఒక మంత్రగాడు రాత్రి రెండో జాములో సుమిత్రను తనతో ఒంటరిగా రమ్మని, వూరికి ఉత్తరంగా శ్మశానంలో నాయుడు మీద ప్రయోగం చేసినవాళ్లు ఒక మైనం బొమ్మను పాతేసి ఉంచారని - దాన్ని తీసి హోమం చేసి నీళ్లల్లో కలిపేయాలని చెప్పాడుట.

సుమిత్రకి భయంవేసింది. వెళ్లలేదుట. కాని సుమిత్ర తల్లి మాత్రం ధైర్యంగా మంత్రగాడితో వెళ్లి అర్ధరాత్రి వూరవతల శ్మశానంలో నక్కలు కూసే వేళ ఒక చోట జపం చేయించింది. అక్కడ గుండం త్రవ్వి, ఆ మంత్రగాడు ఒక మైనపు బొమ్మ తీశాడు. అరంగుళాలుంటుంది!దానికి మోకాళ్లలో గుండుసూదులు గ్రుచ్చి వున్నాయి. "చూశారా అమ్మగారూ! దీనికి ఏడు సూదులు గ్రుచ్చారు- అంటే ఏణ్ణెల్లలో కాళ్ళు పడిపోయి మనిషి శుష్కించి ప్రాణాలు వదిలేస్తాడని అర్థం' అన్నారు.

మర్నాడు నాయుడుగారి పెరట్లో విరుగుడు చేశాడు వాడు. అంటే మరో బొమ్మను చేసి పాతిపెట్టాడు. అది ఆ ప్రయోగం చేసిన వాడి చేతులు పడిపోవడానికన్నాడు.

నాయుడుగారి ఇల్లు ఆ వీధిలో వారందరికీ పిచ్చాపాటీ అయింది. కొందరు అటు వెళ్లకూడదన్నంత భయపడ్డారు. కాని కొందరు ధైర్యం చేసి వెళ్లారు.

మంత్రగాళ్లను పట్టుకొన్నారు. నాయుడు ఇల్లు గుల్లయింది. బ్రతుకుతాడా? లేదా? అని నిలదీశారుట.

"నాయుడు గనక చస్తే మిమ్మల్ని ఈ వూళ్లోనే పాతేస్తా" మన్నారు ఆ పేట వదలకుండా. ఆ ఇద్దరి మంత్రగాళ్ల గుండెలూ ఆగిపోయాయి! మళ్లీ అమితవేగంతో కొట్టుకోసాగాయి.

జనం తమ ప్రేగులు తీస్తారేమోనని భయపడ్డారు వాళ్లు. నాయుడిమీద పడి ఏడుస్తున్న ఆడ కూతుళ్ల మొదలూ బోసిగా వున్నాయి.

"నాయుడు చావలేదన్నారు" మంత్రగాళ్లు. డాక్టర్లు మాత్రం డెత్ సర్టిఫికెట్ ఇచ్చారు.

మంత్రగాళ్లు పెరట్లోని బొమ్మని త్రవ్వి తీసికొని శ్మశానానికి వెళ్ళారు. అక్కడ హోమం చేసి మంత్రాలతో ఆ బొమ్మని పాతేస్తే ఇక్కడ నాయుడు తిరిగి లేస్తాడని చెప్పారు.

శవాన్ని మర్నాటిదాకా తియ్యొద్దన్నారు. ఆఖరి దఫాగా మరో ఏభై గుంజుకున్నారుట. మంత్రగాళ్ళిద్దరితో మరో ధైర్యమున్న నలుగురు రౌడి సజ్జు ఉత్తరంగా ఉన్న శ్మశానికి వెళ్లారు.

మర్నాడు ప్రొద్దున తప్పతాగిన ఆ రౌడీలు నలుగురూ మాత్రం తిరిగి వచ్చారు.

మంత్రగాళ్లు మాయమైపోయారన్నారు.

నాయుడు శవం ఇక ఉండకూడదన్నారు. పురపాలక శాఖాధికారులు! అది చివికిపోబోతున్నది. లాభంలేదు....

ఆ విధంగా నాయుడు యిహలోక యాత్ర పూర్తయింది.

శివుడు కథ పూర్తి చేసేసరికి రామం భయంతో నన్ను కౌగిలించుకుని నిద్రపోతున్నాడు.

భీముడు గుప్పగుప్పున సిగరెట్‌లు కాలుస్తున్నాడు. వాన వెలియలేదు. నామీద ఆకలి తన ప్రతాపం చూపిస్తున్నది!

శివుడు 'నాకు దెయ్యాలంటే నమ్మకం లేదు కాని ఎందుకేనా మంచిది" అంటూ గొణుగుతూ, "కొవ్వొత్తి వుంటే వెలిగించుదూ" అంటున్నాడు- వాన కురిసి కురిసి అలసిపోయింది!

**(1964 ఆంధ్రపత్రిక వారపత్రిక)**